క్లుప్తంగా

రజకుల క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రజక సంక్షేమ సంఘం 2025 క్యాలెండర్లను సీఐ రమేష్‌బాబు ఆవిష్కరించారు. రజకుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి పేర్కొన్నారు. తమను ఎస్సీ జాబితాలో చేర్చాలనేది చిరకాల కోరిక అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఓబులేసు, నాయకులు మహేష్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

సంజామల: మండల అధికారులు ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ సాల్మన్ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమాదేవి, జయమ్మ, మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, ఈఓఆర్డీ రాధిక రెడ్డి, ఎంఈఓ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, శాంత, హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు పాల్గొన్నారు.

డీఎస్పీకి సత్కారం



డీఎస్పీని సత్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

డోన్ టౌన్: గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులును మంగళవారం మాల మహానాడు నాయకులు సత్కరించారు. కురిమెట్ల నారాయణ, రాజశేఖర్, నాగేంద్ర, ఓబయ్య, జాన్సన్, సూరిబాబు పాల్గొన్నారు.

పింఛన్ల రీవెరిఫికేషన్



లబ్ధిదారుడిని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న వైద్యులు

బనగానపల్లె రూరల్: మండలంలో పింఛన్ లబ్ధిదారుల రీవెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. మొదటి విడతలో భాగంగా మంచానికే పరిమితమై నెలకు రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను వెరిఫికేషన్ చేస్తున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన వైద్యులు ఎల్లోజీ, మాధవి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి సదరం సర్టిఫికెట్లు పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. మండలంలో మొత్తం 46 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం సాయంత్రంలోగా రీవెరిఫికేషన్ పూర్తవుతుందన్నారు.

ప్రణాళికతో విజయం సొంతం



బహుమతులు ప్రదానం చేస్తున్న సంఘం నేతలు

బనగానపల్లె: విద్యార్థులు క్రమశిక్షణ ప్రణాళికతో చదివితే విజయం సొంతం అవుతుందని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. మంగళవారం మండలంలోని రామతీర్థం జెడ్పీ పాఠశాలలో విద్యలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం సోమశేఖర్, జయజయ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు పూసపాటి బాలజీ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు అడ్డుపడితే ఉద్యమిస్తాం

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి వద్ద పేదల ఇంటి నిర్మాణాలను మున్సిపల్ అధికారులు అడ్డుకుంటే ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు, పి.సుంకయ్య హెచ్చరించారు. గ్రామంలో పట్టాలు పొందిన లబ్ధిదారులతో పేరంటాలమ్మ గుడి వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. 2013లో అప్పటి ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసిందన్నారు. అధికారికంగా పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే మున్సిపల్ అధికారులు అడ్డుకోవడం దారుణమన్నారు.

వ్యాపారాలు ఢమాల్..!

- విపరీతంగా పెరిగిన ధరలు
- ఇసుక దొరక్క తగ్గిన సిమెంట్, కడ్డీల వ్యాపారం
- పేద, మధ్య తరగతి వర్గాల చేతిలో డబ్బుల్లేక అవస్థలు
- దెబ్బతీస్తున్న ఆన్‌లైన్ బిజినెస్
- 40 శాతం మేర పడిపోయిన వ్యాపారాలు



కొలిమిగుండ్లలో అమ్మకాలు లేని సిమెంట్ దుకాణం

కోవెలకుంట్ల: వివిధ వ్యాపారాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎనిమిది నెలల నుంచి పెద్దగా వ్యాపారాలు జరగక నష్టాల ఊబిలో చిక్కుకున్నాయి. నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల పరిధిలో దాదాపు మూడు వేలకు పైగా వస్త్ర, సిమెంట్, కడ్డీలు, నిత్యావసర సరుకులు, బంగారు, తదితర వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల వస్తువులపై ధరలు పెరగడం, ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి రావడం వ్యాపారాలను దెబ్బ తీశాయి. వివిధ వర్గాల ప్రజల వద్ద చేతిలో డబ్బులు లేకపోవడంతో వ్యాపారాలు గణనీయంగా తగ్గాయి. ఇసుక అందుబాటులో లేకపోవడంతో గృహ, వ్యాపార సముదాయ నిర్మాణాలు నిలిచిపోవడంతో సిమెంట్, కడ్డీలు, కాంక్రీట్, తదితర గృహ నిర్మాణ సామాగ్రి కొనుగోళ్లు పూర్తిస్థాయిలో పడిపోయాయి. గతంతో పోలిస్తే 40 శాతం వ్యాపారాలు తగ్గడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వెలవెలబోతున్న దుకాణాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యాపారాలు బాగా అభివృద్ధి చెందుతాయని అన్ని రకాల వ్యాపారులు భావించారు. తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యాపారాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ఫుట్‌పాత్ మీద నిర్వహించుకునే వ్యాపారాల నుంచి పెద్ద షాపుల వరకు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి. కిరాణ దుకాణం, ఫ్యాన్సీ స్టోర్‌లు, సిమెంట్, స్టీల్ వ్యాపారాలతో పాటు గ్రానైట్స్, టైల్స్ వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత ప్రభుత్వంలో ఏదో ఒక పథకం ద్వారా ప్రజలు లబ్ధిపొందేవారు. ఆ డబ్బుతో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేస్తుండడంతో వ్యాపారాలు బాగా ఉండేవని వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- అవుకు మేజర్ గ్రామ పంచాయతీలో 200లకు పైగా వ్యాపార సముదాయాలున్నాయి. ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడం వల్ల బిజినెస్ సరిగ్గా జరగడం లేదు. రవాణా ఖర్చులు, దుకాణంలో పనిచేసేవారి కూలీలు పెరిగాయి. దీంతో దుకాణాల బాడుగలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. గతంలో ప్రజల చేతుల్లో డబ్బులు పుష్కలంగా ఉండడం, పంటల్లో లాభాలు రావడంతో వ్యాపారాలు బాగా జరిగేవి. అన్ని వర్గాల వారికి ఉపాధి లభించేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో వ్యాపారాలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయి.
- కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో సుమారు వెయ్యి వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్నారు. నిత్యావసర సరుకులకు సంబంధించి ఆయిల్, కందిపప్పు, వేరుశనగపప్పు, గోధుమపిండి, ఉప్మారవ్వ ధరలు భారీగా పెరిగాయి. నిత్యావసర సరుకులను కొనుగోలు చేయడం పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో బంగారు, వెండి ఆభరణాలు కొనుగోళ్లు పూర్తిగా పడిపోయాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా పాలసీని అందుబాటులోకి తెచ్చినా ఇసుక దొరక్క సిమెంట్, కడ్డీలు, తదితర గృహ నిర్మాణ సామాగ్రి అమ్మకాలు నిలిచిపోయాయి. గతంతో పోలిస్తే సుమారు 40 శాతం మేర వ్యాపారాలు తగ్గినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభావం మరింతగా ఉంటుందని చెబుతున్నారు.
- సంజామల మండలంలో వివిధ వ్యాపారాలు పూర్తి స్థాయిలో స్తంభించిపోయాయి. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 200కు పైగా వివిధ వ్యాపార సముదాయాలున్నాయి. గ్రామాల్లో పోటీ ఏర్పడి పుట్టగొడుగుల్లా దుకాణాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరకపోవడం, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో వ్యాపారాలు స్తంభించిపోయాయి.
- బనగానపల్లె పట్టణంలో అన్ని రకాల వ్యాపారాలు తగ్గడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కుడా పథకాన్ని అమల్లోకి తేవడంతో వివిధ ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ అనుమతి ఇవ్వడం లేదు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో వందలాది మంది కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల వద్ద డబ్బులేకపోవడం.. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో జనం చేతుల్లో చిల్లిగవ్వ లేక కొనుగోలు శక్తి తగ్గిపోయింది. గతంలో రోజు రూ.50 వేల నుంచి లక్ష వరకు జరిగే హార్డ్‌వేర్, పెయింటింగ్స్ దుకాణదారులకు ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.20 వేలు వ్యాపారం కూడా జరగడం లేదు. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో కిరాణం దుకాణాల పరిస్థితి ఇదే విధంగా మారింది.



కోవెలకుంట్లలో వెలవెలబోతున్న దుకాణం

ఆన్‌లైన్ బిజినెస్ దెబ్బతీస్తోంది



అన్ని వ్యాపారాలను ఆన్‌లైన్ బిజినెస్ దెబ్బతీస్తోంది. పట్టణాల్లో మాల్స్ విపరీతంగా పెరిగిపోవడం, అన్ని రకాల సేవలు డోర్ డెలవరీ జరుగుతుండడంతో వ్యాపారాలపై ప్రభావం పడుతోంది. ఆయిల్, కందిపప్పు, గోధుమపిండి, తదితర నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంతో పోలిస్తే 40 శాతం వ్యాపారం తగ్గింది.

–దినకర్‌శెట్టి, కిరాణ వ్యాపారి, వల్లంపాడు, కోవెలకుంట్ల

పోటీ పెరిగి వ్యాపారం తగ్గింది



గతంలో గ్రామంలో నాలుగు చికెన్‌కొట్లు ఉండేవి. ప్రస్తుతం ఆరు చికెన్‌కొట్లు ఉన్నాయి. పోటీ పెరగడంతో వ్యాపారం పూర్తిగా తగ్గిపోయింది. గతంలో రోజుకు 15 నుంచి 20 కిలోల చికెన్ విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం ఏడు, ఎనిమిది కిలోల చికెన్ అమ్మడం కష్టంగా ఉంది. చికెన్ వ్యాపారం ద్వారా కుటుంబం గడవడం కష్టంగా మారింది.

–సద్దాం ఉసేన్, చికెన్ షాప్, ఆకుమల్ల, సంజామల

409 పశువులకు వైద్య పరీక్షలు



దూడలకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి,



నట్టల నివారణ మందులను అందజేస్తున్న ఏడీ

కోవెలకుంట్ల: మండలంలోని పొట్టిపాడులో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య పశువైద్య శిబిరంలో 409 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కోవెలకుంట్ల పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. శిబిరంలో 12 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 103 గొర్రెలు, మేకలకు టీకాలు, 286 దూడలు, పశువులు, జీవాలకు నట్టల నివారణ, రెండు గర్భ నిర్ధారణ, ఆరు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

బనగానపల్లె రూరల్: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, చిన్నబాబు అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టపల్లె గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం జరిగింది. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పశువులకు జబ్బు చేస్తే పశువైద్య సిబ్బందిని సంప్రదించి తగిన మందులను వాడాలని సూచించారు. అనంతరం 15 దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. పశువైద్య సిబ్బంది పుల్లయ్య, జయరాం నాయక్ పాల్గొన్నారు.

సకాలంలో వ్యాక్సిన్‌లు వేయించాలి

అవుకు: పశువులకు సకాలంలో వ్యాక్సిన్‌లు వేయిస్తే అనారోగ్యానికి గురికావని పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 80 పశువులను పరీక్షించి చికిత్స అందించారు. నట్టల నివారణ మందులు తాపించారు.

పశు వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

బేతంచెర్ల: పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని పశు సంవర్ధకశాఖ ఏడీ వసంత లక్ష్మి సూచించారు. మండలంలోని కనుమకింది కొట్టాల, అంబాపురం గ్రామాల్లో మంగళవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న గోకులం షెడ్లు, పశుగ్రాసం పెంపకం వంటి పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను అందజేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యానేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కోవెలకుంట్ల: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేయడం చట్ట రీత్యానేరమని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లతో సోదరభావంతో మెలిగి అన్ని విధాలా వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పట్టుదల, కృషితో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సీఐ హనుమంతు నాయక్, ప్రిన్సిపాల్ రమాదేవి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు మద్దిలేటిస్వామి, రామలింగారెడ్డి, రామానుజులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

బేతంచెర్ల: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చి ఆదర్శంగా నిలవాలని స్టేట్ బ్యాంక్ మేనేజర్ రవి తేజ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాలు అన్నారు. పట్టణంలోని అమ్మవారిశాలలో దాతలు కుప్పా శ్రీనివాసులు, మారం ప్రవీణ్ కుమార్ సహకారంతో ఆర్యవైశ్య పేద మహిళలకు రూ. 30 వేల విలువచేసే 5 కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు గుండా అశ్వర్థ నారాయణ, శేషఫణి, మనోహర్, సతీష్, కందగడ్డల జనార్దన్, మారం విష్ణు, సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం హరిజనవాడ పాఠశాల విద్యార్థులకు చిన్నపరెడ్డి, జీవిత దంపతులు మంగళవారం పుస్తకాలు, పలకలు, పేట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వెంకటేష్ నాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ప్లేట్లు అందజేశారు.

హడలెత్తిస్తున్న కొండ ముచ్చు



ఇంటి గోడపై కూర్చున్న కొండ ముచ్చు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలో కొండ ముచ్చు ప్రజలను హడలెత్తిస్తోంది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కాని వారం నుంచి కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో తిష్టవేసింది. కొండ ముచ్చు భయానికి మహిళలు, పిల్లలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అక్కడక్కడే సంచరిస్తూ ఇళ్లపైన, వ్యాపార సముదాయాల వద్ద ఉండడంతో ఎక్కడ దాడి చేస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు పోతుండడంతో అక్కడ పనిచేసే సిబ్బంది వాహనాలకు డీజిల్, పెట్రోల్ పోయాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండముచ్చును ఇక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డోన్ టౌన్: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి బుధవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 9959225795 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

కోవెలకుంట్ల: పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్న ఆటో డ్రైవర్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బనగానపల్లె నుంచి కోవెలకుంట్ల మండలం కలుగొట్లకు ఆటో లోపల, పైనా ప్రయాణికులతో వెళుతుండగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి ఆటోను సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉద్యోగాలకు 16 మంది ఎంపిక

డోన్ టౌన్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 42 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. బీ న్యూ మొబైల్స్, ఫ్యూచర్ ప్రాపర్టీ, బ్రైట్‌టెక్ ఇండస్ట్రీయల్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 16 మందిని ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ..నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉపాధి కల్పనా అధికారి చాంద్‌బాషా, ప్లేస్‌మెంట్ అధికారి సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేతంచెర్ల: పట్టణంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, టౌన్ ఏఈ పుల్లయ్య తెలిపారు. బేతంచెర్లలోని సిద్ధప్ప గుడి, డ్రైవర్స్ కాలనీ, గొరిపేట, బైటిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గుండెపోటుతో కూలీ మృతి



సుధాకర్ మృతదేహం

డోన్ రూరల్: చిన్నమల్యాపురం గ్రామంలోని ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కూలీ గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని వలసల గ్రామానికి చెందిన బుక్కాపురం సుధాకర్ ఫ్యాక్టరీలో పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది. వెంటనే డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

బుక్ కీపర్లపై విచారణ చేపట్టాలి

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలోని బుక్‌కీపర్లపై అధికారులు విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు కోయలకొండ నాగరాజు, చిన్నరహిమాన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన ఒక బుక్ కీపర్ పొదుపు సంఘం సభ్యురాలికి తెలియకుండా రూ. 56 వేలు కాజేసినట్లు తెలిసిందన్నారు. లోన్ డబ్బులు కాజేసినట్లు బుక్ కీపర్ బాధిత మహిళ ముందు ఒప్పుకున్నట్లు తెలిపారు. దీన్ని బట్టి చూస్తే పొదుపు సంఘాల లోన్‌ల విషయంలో బుక్‌కీపర్లు చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోందన్నారు. అధికారులు తక్షణమే బుక్‌కీపర్ల వ్యవహారంపై విచారణ చేపట్టాలన్నారు. లోన్ డబ్బులు కాజేసిన బుక్‌కీపర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో సంక్షేమ ఫలాలు



చెన్నంపల్లె రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

అవుకు: కేంద్రం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ ఆధారంగానే భవిష్యత్తులో సంక్షేమ ఫలాలు అందుతాయని.. ప్రతి రైతు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ అన్నారు. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసి పారదర్శకతను పెంచడానికి ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకొచ్చిందని తెలిపారు. పొలం ఉన్న ప్రతి రైతు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుని 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య ద్వారానే వ్యవసాయ సంక్షేమ పథకాలు, సబ్సిడీ అమలవుతాయని తెలిపారు. రైతులు వారి ఆధార్ కార్డుతో పాటు లింకు అయిన ఫోన్ నంబర్, పొలం 1బి తీసుకెళ్లి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- డీఎస్పీ శ్రీనివాసులు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

డోన్ రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీఓ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీనివాసులు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల సమయంలో రక్షణ ఇస్తుందని తెలిపారు. హెల్మెట్ లేకపోవడం వల్లే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమరసత యాత్ర ప్రారంభం



యాత్ర ప్రారంభిస్తున్న విశ్వహిందూ సభ్యులు,



అవుకు: రథయాత్ర నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

బనగానపల్లె: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నంద్యాల విశ్వహిందూ పరిషత్ సభ్యులు సామాజిక సమరసత యాత్రను ప్రారంభించారు. ప్రఖండ్ కార్యదర్శి ఓబులరెడ్డి రథ పూజ చేశారు. కార్యక్రమంలో స్వామిజీలు శివయోగేంద్ర సరస్వతి, అభినవ శంకరనందస్వామి, రవ్వలకొండస్వామి, జ్ఞానందస్వామి జ్ఞానేశ్వరిమాత, పరిషత్ దక్షిణాంధ్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, సహాయ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళేశ్వరరెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. యాత్ర బ్రహ్మంగారి మఠం వద్ద ముగుస్తుందని తెలిపారు.

సమాజంలో అసమానతలు తొలగిపోవాలి

కొలిమిగుండ్ల: సమాజంలో అసమానతలు తొలగిపోతేనే అందరూ సుఖసంతోషాలతో ఉంటారని చాగలమర్రి శివరామ ఆశ్రమ అభినవ శంకరానంద స్వామి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సమరసత యాత్ర మంగళవారం బెలుం ,కొలిమిగుండ్లకు చేరుకుంది. ప్రజలతో సమావేశం నిర్వహించిన అనంతరం వీధుల్లో జైశ్రీరాం నినాదాలు చేస్తూ గ్రామోత్సవంగా వెళ్లారు. సామాజిక సమరసతకు జగ్జీవన్‌రామ్, సర్దార్ నాగప్ప, దామోదరం సంజీవయ్య లాంటి వారి కృషి ఎనలేనిదన్నారు. అన్నమయ్య తన కీర్తనల ద్వారా సమరసతను చాటి చెప్పారని గుర్తు చేశారు. కాలజ్ఞానాన్ని అందించిన పోతులూరి వీరబ్రహేంద్రస్వామి నడయాడిన పుణ్యభూమి మనది అని కొనియాడారు. గడప లోపలే కులం.. గడప దాటితే హిందువులం అనే సమరస భావాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకే విశ్వహిందూ పరిషత్ ఈయాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్చక పురోహిత్ రాష్ట్ర ప్రముఖ్ శివశంకర్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హిందువులంతా ఒక్కటే

అవుకు: కులం అనే భావన లేకుండా హిందువులంతా ఒక్కటే అని, హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని కాశనూరు శివయోగేంద్ర స్వామిజీ, చాగలమర్రి అభినవ శంకరానంద స్వామిజీ తెలిపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బనగానపల్లె చింతమాను మఠం నుంచి కందిమల్లాయపల్లె వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం వరకు జరిగే సామాజిక సమరసత యాత్రలో భాగంగా మంగళవారం అవుకులో రథయాత్ర నిర్వహించారు. మార్కెట్ వీధిలోని రామాలయం నుంచి శ్రీభూలక్ష్మీ సమేత చెన్న కేశవ స్వామి ఆలయం వరకు యాత్ర నిర్వహించి స్వామివార్లకు పూజలు చేశారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు వారిని విధుల్లోకి తీసుకుని రూ.10 వేల గౌరవ వేతనం అందించాలని సీఐటీయూ పట్టణ, మండల అధ్యక్షులు శ్రీకాంత్, రామాంజనేయులు, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నక్కిహరి డిమాండ్ చేశారు. మంగళవారం పాత బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. వార్డు వలంటీర్లు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.